
# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 375 | పేజీలు: 4 | వెల: 4/- | బుధవారం ● 31, జులై 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి

## ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత


### విచారణను ఆగస్ట్1కి వాయిదా వేసిన హైకోర్టు



**హైదరాబాద్,జూలై30(నమస్తే ఉదయం):** పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై మంగళవారం తెలంగాణ హైకోర్టు విచారణ చేప్టటింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేం దర్, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు పిటిషన్ వేశారు. వాదోప వాదాలు విన్న హైకోర్టు.. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేసే విధంగా స్పీకర్ కు ఆదేశాలు ఇవ్వాలని కోరారు పిటిషనర్ తరపు న్యాయవాది గండ్ర మోహన్ రావు.స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన ముగ్గురు ఎమ్మెల్యేలపై ఏలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు గండ్ర. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన పలు తీర్పులను ప్రస్తావించగా.. తదుపరి విచారణ ఆగస్టు 1కి హైకోర్టు వాయిదా వేసింది.

## తెలంగాణ విద్యుత్ విచారణ కమిషన్‌కు కొత్త చైర్మన్

- హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ మదన్ బి లోకూర్ నియామకం



**హైదరాబాద్,జూలై30 (నమస్తే ఉదయం):** తెలంగాణ విద్యుత్ విచారణ కమిషన్ కొత్త ఛైర్మన్‌గా జస్టిస్ మదన్ భీమ్‌రావు లోకూర్ నియమితులయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆయన హైకోర్టు సీజేగా, ఆ తర్వాత సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా కూడా పని చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కొత్త ఛైర్మన్‌ను తెలంగాణ ప్రభుత్వం నియమించింది. ఇంతకు ముందు కమిషన్ ఛైర్మన్‌గా జస్టిస్ నరసింహారెడ్డి వ్యవహరించారు. అయితే సుప్రీం కోర్టు సూచనలతో ఆయన రాజీనామా చేశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్ కొనుగోలుకు... యాదాద్రి, భద్రాద్రి సబ్‌క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు తెలంగాణలో గత ప్రభుత్వం తీసు కున్న నిర్ణయాలపై విచారణ చేయడానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఛైర్మన్‌గా జస్టిస్ ఎల్.నంసింహారెడ్డిని నియమించారు. విచారణ జరుగుతున్న సమయంలో.. కమిషన్ ఏర్పాటు, దాని ఛైర్మన్ నిష్పాక్షికతను సవాల్ చేస్తూ మాజీ సీఎం కేసీఆర్ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. కమిషన్ ఛైర్మన్‌ను మార్చాలని ఆదేశించింది. అదే సమయంలో విచారణ కమిషన్ ఏర్పాటు నోటిఫికేషన్‌ను సైతం కొట్టే యాలన్న కేసీఆర్ వినతిని పరిగణనలోకి తీసుకోలేదు. ఈ పరిణామాల నేపథ్యంలో కమిషన్ ఛైర్మన్ పదవి నుంచి వైదొలగుతున్నట్లు జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి తన రాజీనామా లేఖను న్యాయవాది ద్వారా సుప్రీం కోర్టుకు సమర్పించారు.



రైతులకు చెక్కులు అందజేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

# రైతులను రుణ విముక్తులను చేస్తా

### రైతులకు 12 రోజుల్లోనే రుణమాఫీకి 12వేల కోట్లు జమ

- తెలంగాణ రైతులకు తీపి కబురు
- రెండో విడత రుణమాఫీ ప్రారంభం
- లాంఛనంగా ప్రారంభించిన సిఎం రేవంత్
- అర్హులకు లక్షన్నర రుణమాఫీ కింద నిధులు విడుదల
- 6,40,223 మందికి రూ.6190.01 కోట్లు నిధులు విడుదల
- రైతుల ప్రయోజనమే మా ప్రాధాన్యం అన్న సిఎం రేవంత్

**హైదరాబాద్,జూలై30(నమస్తే ఉదయం):** తెలంగాణ రైతులకు రేవంత్ సర్కార్ తీపి కబురు చెప్పింది. రైతు ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమని, అందుకనే రుణమాఫీ చేశామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కార్పొరేట్ సంస్థల అధిపతులు బ్యాంకులను మోసం చేస్తున్నారన్న ఆయన.. గత పదేళ్లలో కార్పొరేట్ కంపెనీలు రూ.14 లక్షల కోట్లు ఎగవేశాయని చెప్పారు. కానీ, సాగుకోసం బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పులు తిరిగి కట్టలేక రైతులు నానా అవస్థలు పడుతున్నారని అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం వాళ్ల రుణాలను మాఫీ చేస్తోందని చెప్పారు. రెండో విడత పంట రుణాల మాఫీ నిధుల విడుదల సందర్భంగా శాసనసభ ప్రాంగణంలో ఏర్పాటు మిగతా.. 2లో

## ఇదే సభలో కులగణన బిల్లు ఆమోదిస్తాం...

### అనురాగ్ ఠాకూర్ వ్యాఖ్యలపై రాహుల్ సవాల్

### ఠాకూర్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందన



**న్యూఢిల్లీ, జూలై30 (నమస్తే ఉదయం):** ఇదే సభలో కులగణన బిల్లును ఆమోదించి చూపుతామని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మంగళవారం ప్రకటించారు. లోక్ సభలో బిజెపి ఎంపీ అనురాగ్ ఠాకుర్ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ తీవ్రంగా విరుచుకుపడ్డారు. తనను అవమానించారని మండిపడ్డారు. అనురాగ్ ఠాకుర్ 'ఎవరికైతే తమ కులం కూడా తెలియదో వారు కుల గణన గురించి మాట్లాడుతున్నారని అన్నారు. దీనిపై రాహుల్ గాంధీ స్పందిస్తూ ఎవరైతే ఆదివాసీలు, దళితులు, వెనుకబడిన వారికి సంబంధించిన సమస్యలు లేవనెత్తుతారో వారిని కించపరుస్తున్నారని అన్నారు. కులం తెలియని వారు కూడా కుల గణన గురించి మాట్లాడుతున్నారు. ఈ సభలోనే మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ రిజర్వేషన్‌ను వ్యతిరేకించారని నేను స్పీకర్‌కు గుర్తు చేయాలనుకుంటున్నాను అని బిజెపి ఎంపి అనురాగ్ ఠాకూర్ సభలో అన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కుల గణన చేపడతామని దేశానికి హామీ ఇచ్చిన రాహుల్ గాంధీ తన వాగ్దానాన్ని పునరుద్ఘాటించారు.మీరు ఎంత కావాలనుకుంటే అంతగా నన్ను అవమానించవచ్చు, కానీ మేము పార్లమెంటులో మిగతా.. 2లో




## నేటితో ముగియనున్న ఐటి రిటర్న్లు


- దాఖలు చేయకుంటే జరిమానాలు తప్పవు

**న్యూఢిల్లీ,జూలై30(నమస్తే ఉదయం):** ఆదాయపు పన్ను చెల్లింపుదారులు రిటర్నులను దాఖలు చేసేందుకు గడువు జులై 31 బుధవారంతో ముగియనుంది. ఇప్పటికైతే పొడిగించే సూచనలేవీ కనిపించడం లేదు. గతేడాది కూడా మిగతా.. 2లో

## బిఆర్ఎస్ కొత్త డ్రామాలకు తెర

- ఎమ్మెల్యేల యూటర్న్ అంటూ ప్రచారం
- అలాంటిదేమీ లేదు.. మరికొందరు చేరుతారు
- మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డిల ధీమా
- బిఆర్ఎస్ డ్రామాలను నమ్మరన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేలు

**హైదరాబాద్,జూలై30(నమస్తే ఉదయం):** ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ వైపు వెళ్లడం లేదని.. అదంతా గులాబీ నేతలు చేసుకుంటున్నా ప్రచారమేనని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంటకటరెడ్డి, ఇతర ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. ఇదంతా బిఆర్ఎస్ ఆడుతున్న డ్రామాలని అన్నారు. తమ ఎమ్మెల్యేలు జారిపోవడంతో కొత్త డ్రామాలకు తెర లేపారని అన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు ఎక్కడికి పోరని మంత్రి పొంగులేటి తేల్చి చెప్పారు. మంగళవారం నాడు అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్ చాట్ చేశారు. పాత పరిచయం కాబట్టి కలసి ఉంటారని అన్నారు. తమ దగ్గరకి వచ్చిన నేతలు ఎవరు ఇబ్బంది కలగకుండా ఉంటారని చెప్పారు. తమ దగ్గర ప్రేమ రాజకీయాలు ఉంటాయని అన్నారు. ఎవరు ఎక్కడికి మిగతా.. 2లో





## సొంతగూటికి గద్వాల ఎమ్మెల్యే

- తెలంగాణ రాజకీయాల్లో సంచలనం
- బండ్ల కృష్ణమోహన్ యూటర్న్

**హైదరాబాద్,జూలై30(నమస్తే ఉదయం):** తెలంగాణలో రాజకీయాలు మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సహజంగానే విపక్ష పార్టీ నుంచి అధికార పార్టీలోకి ఎమ్మెల్యేలు, ఎంపీలు జంప్ అవుతుంటారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత నుంచి ఇప్పటి వరకూ అలాగే జరిగింది. కానీ, ఇప్పుడు సీన్ రివర్స్ అవుతోంది. బీఆర్ఎస్ ఖాళీ అవుతుందంటూ ఇప్పటివరకు కాంగ్రెస్ నేతలు చేసిన ప్రకటనలకు విరుద్ధంగా పరిస్థితులు ఉన్నాయి. అవును.. బీఆర్ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలంతా ఇప్పుడు మళ్లీ సొంతగూటి వైపు చూస్తున్నారట. ఇప్పటికే గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి.. కాంగ్రెస్ వొద్దు మిగతా.. 2లో



## వయనాడ్ విపత్తులో పెరుగుతున్న మృతులు

- 107కు చేరిన మృతులు సంఖ్య
- నేటి నుంచి రెండ్రోజులు సంతాప దినాలు

**తిరువనంతపురం,జూలై30(నమస్తే ఉదయం):** కరళలోని వయనాడ్ జిల్లాలో భారీగా కొండ చరియలు విరిగిపడిన ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతూనే ఉంది. మరోవైపు, వయనాడ్ విపత్తు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నుంచి రెండు రోజులు సంతాపదినాలుగా ప్రకటించింది. వయనాడ్ జిల్లాలో పశ్చిమ కనుమల నడుమ ఆహ్లాదంగా ఉండే ఈ ప్రాంతం ఇప్పుడు ప్రకృతి ప్రకోపంతో అతలాకుతలమైంది. భారీ వర్షం కారణంగా కొండచరియలు విరిగిపడి బీభత్సం సృష్టించాయి. ఎన్నో ఇళ్లు నేలమట్టమయ్యాయి. దీంతో పదుల సంఖ్యలో ప్రాణాలు ఆ శిథిలాల కింద ఛిద్రమయ్యాయి. వయనాడ్ జిల్లాలోని మెప్పాడి, ముండక్కై, చురల్‌మల ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఈ ఘోర విపత్తులో ఇప్పటివరకు 107 మంది మృతిచెందినట్లు రాష్ట్ర రెవెన్యూ కార్యాలయం వెల్లడించింది. తొలుత అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ముండక్కై ప్రాంతంలో కొండచరియలు విరిగిపడ్డాయి. సమాచారమందుకున్న రెస్క్యూ సిబ్బంది వెంటనే అక్కడకు వెళ్లి సహాయక మిగతా.. 2లో

## పెన్షన్ల జాప్యంపై సుప్రీం కోర్టు ఆగ్రహం

- కేంద్రానికి రెండు లక్షలు జరిమానా విధింపు





**న్యూఢిల్లీ,జూలై30(నమస్తే ఉదయం):** పెన్షన్ల జాప్యంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ పథకం అమలు చేయకపోవడపై కేంద్రంపై సీరియస్ అయ్యింది. భారత సైన్యంలో రీటైర్డ్ రెగ్యులర్ కెప్టెన్‌లకు చెల్లించే కేంద్రం నిర్ణయం తీసుకోకపోవడంపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. వన్‌ర్యాంక్ వన్ పెన్షన్ చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఈ పక్రియలో ఏళ్ల తరబడి జాప్యం చేస్తోందని మండిపడింది. ఈ క్రమంలో కేంద్రానికి రెండు లక్షలు జరిమానా విధించింది. ప్రభుత్వానికి చివరి అవకాశం ఇచ్చిన సుప్రీం కోర్టు నవంబర్ 14లోగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించింది. లేదంటే పెన్షన్ పెంపుపై తామే ఆదేశాలు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించింది. పెన్షన్ విషయంలో దాఖలైన పిటిషన్లను జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఆర్‌మహదేవన్‌లతో మిగతా.. 2లో

## తాము కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం..



- తెల్లం వెంకట్రావ్... కాలె యాదవ్ స్పష్టీకరణ

**హైదరాబాద్,జూలై30(నమస్తే ఉదయం):** కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్‌లోకి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య వెళ్తారని ప్రచారం జరిగింది. ఈ విషయాన్ని ఇద్దరు ఎమ్మెల్యేలు తీవ్రంగా ఖండించారు. తాము కాంగ్రెస్‌లోనే కొనసాగుతామని ఇద్దరు ఎమ్మెల్యేలు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు ఫేక్ ప్రచారం చేస్తున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా.. 2లో



## నేడు గవర్నర్‌గా జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం

**హైదరాబాద్,జూలై30(నమస్తే ఉదయం):** తెలంగాణ గర్నవర్‌గా నియామకమైన జిష్ణుదేవ్ వర్మ బుధవారం పదవీ ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో బుధవారం సాయంత్రం 5.03 గంటలకు ఆయన గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టనున్నట్లు రాజ్‌భవన్ పేర్కొంది. రెండురోజుల కిందట కేంద్ర ప్రభుత్వం 9 రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించిన విషయం తెలిసిందే. జిష్ణుదేవ్ వర్మ 2018 నుంచి 2023 వరకూ త్రిపుర రాష్ట్ర డిప్యూటీ సీఎంగా పని చేశారు. 1957 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం రోజున జిష్ణుదేవ్ వర్మ జన్మించారు. అంతేకాదు గతంలో బాడ్మింటన్ అసోషియేషన్ ఆఫ్ ఇండియాకు అధ్యక్షుడిగా సేవలందించారు. ఈయన త్రిపుర రాజ కుటుంబానికి చెందిన కాగా.. రామ జన్మభూమి ఉద్యమ సమయంలో పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో పార్టీలో 1990లో చేరారు. ఆయన అప్పటి నుంచి ఆ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ వచ్చారు. త్రిపుర ప్రభుత్వంలో ఆయన మంత్రిగా విద్యుత్, గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్, ఆర్థిక, ప్రణాళిక, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణ శాఖల బాధ్యతలను నిర్వర్తించారు.

## ఇదే సభలో కులగణన బిల్లు ఆమోదిస్తాం...

(మొదటి పేజీ తరువాయి)

కుల గణనను పాస్ చేస్తామని రాహుల్ గాంధీ అన్నారు. తర్వాత ఠాకూర్ తన వ్యాఖ్యల్లో ఎవరి పేరును ప్రస్తావించలేదని చెప్పారు. కులం గురించి తెలియని వ్యక్తి కుల గణన గురించి మాట్లాడుతున్నారని నేను అన్నాను, కానీ నేను ఎవరి పేరు ప్రస్తావించలేదని అనురాగ్ ఠాకూర్ తెలిపారు. కానీ తర్వాత రాహుల్ గాంధీ, ఠాకూర్ తనను దుర్భాషలాడారని, అవమానించారని ఆరోపించారు. అయితే ఆయన నుంచి తాను క్షమాపణలు కోరుకోవడం లేదన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రధాన హామీల్లో కుల గణన ఒకటి. ఎన్నికలకు ముందు రాహుల్ గాంధీ దీనిని భారతదేశం యొక్క ఎక్స్-రే అని పిలిచారు. దేశంలో ఎంత మంది వెనుకబడినవారు, దళితులు, గిరిజనులు ఉన్నారో ఎవరికీ తెలియదా? జనాభాలో అత్యధికంగా ఉన్న వారికి వారి సంఖ్య తెలియదు.

బిజెపి ప్రభుత్వానికి కులాల డేటా అక్కర్లేదు. కానీ వివిధ కుల సమూహాల జనాభాను నిర్ధారించడానికి మేము భారతదేశం యొక్క ఎక్స్-రేను పొందుతాము. కుల గణన పూర్తయితే దేశం మారిపోతుంది' అని రాహుల్ గాంధీ అన్నారు. కాగా కుల ప్రాతిపదికన దేశాన్ని విభజించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని బిజెపి ఆరోపించింది.

## జార్ఖండ్‌లో పట్టాలు తప్పిన హౌరా

### ఇద్దరు ప్రయాణికుల దుర్మరణం

రాంచీ,జూలై30(నమస్తే ఉదయం):
జార్ఖండ్‌లోని సెరైకెలా-ఖారవాన్ జిల్లాలో మంగళవారం తెలవారుజామున హౌరా-ముంబై మెయిల్‌కు చెందిన 18 బోగీలు పట్టాలు తప్పడంతో ఇద్దరు ప్రయాణికులు మరణించగా మరో 20 మంది గాయపడ్డారు. ఆగ్నేయ రైల్వేలోని చక్రధర్‌పూర్ డివిజన్ పరిధిలోకి వచ్చే బారాబంబూ సమీపంలో తెల్లవారుజామున 3.45 గంటలకు ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికారులు తెలిపారు. జంషెడ్‌పూర్‌కు 80 కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన జరిగింది. సమీపంలోనే మరో గూడ్సు రైలు కూడా పట్టాలు తప్పిందని, అయితే ఈ రెండు ప్రమాదాలు ఒకేసారి జరిగిందీ లేనిదీ తెలియరాలేదని ఆగ్నేయ రైల్వే అధికార ప్రతినిధి ఓం ప్రకాష్ చరణ్



విలేకరులకు తెలిపారు. హౌరా-ముంబై మెయిల్ ప్రమాదంపై దర్యాప్తునకు రైల్వే ఆదేశించినట్లు ఆయన చెప్పారు. బారాబంబూ సమీపంలో హౌరా-ముంబై మెయిల్‌కు చెందిన 18 బోగీలు పట్టాలు తప్పడంతో ఇద్దరు వ్యక్తులు మరణించారని, మరో 20 మంది ప్రయాణికులు గాయపడ్డారని పశ్చిమ సింగ్‌భం డిప్యూటీ కమిషనర్ కుల్దీప్ చౌదరి ప్రమాద స్థలి వద్ద విలేకరులకు తెలిపారు. హౌరా-ముంబై మెయిల్ ఆగి ఉన్న గూడ్సు రైలును ఢీకొందని ఆయన వెల్లడించారు. క్షతగాత్రులకు బారాబంబూలో ప్రాథమిక చికిత్స అందచేసి మెరుగైన చికిత్స కోసం చక్రధర్‌పూర్‌కు తరలించినట్లు రైల్వే అధికారి ఒకరు తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను రైల్వే శాఖ ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారికి రూ. 5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ. 1 లక్ష చొప్పున పరిహారాన్ని ప్రకటించినట్లు చక్రధర్‌పూర్ సీనియర్ డిసిఎం తెలిపారు. సహాయక చర్యలు పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

## ప్రత్యేక తెలంగాణలో మాకు అన్యాయం

### దక్షిణ తెలంగాణపై ఉన్న ప్రేమ మాపై లేదు

### సిర్పూర్ బిజెపి ఎమ్మెల్యే హరీష్ బాబు ఆరోపణ

హైదరాబాద్,జూలై30(నమస్తే ఉదయం):
ప్రత్యేక తెలంగాణ ఏర్పడ్డ తరవాత తమప్రాంతం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతోందని సిర్పూరు బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అసెంబ్లీ వేదికగా ఆవేదన చెందారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధికి నిధులు ఇస్తారా..? లేక మమ్మల్ని పక్కన ఉన్న మహారాష్ట్రలో కలుపుతారా.. హరీష్‌బాబు రాష్ట్ర ప్రభుత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు.



శాసనసభలో నీటిపారుదల ప్రాజెక్టులపై మంగళవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ 'మా ప్రాంతంపై ఎందుకో చిన్నచూపు, తీవ్ర వివక్ష ఉందని అసహనం వ్యక్తం చేశారు. బ్జడెట్ కేటాయింపులూ లేవు, ప్రాజెక్టులూ లేవని ఆవేదన వ్యక్తం చేస్తూ నిధులైనా ఇవ్వండి లేదంటే మమ్మల్ని మహారాష్ట్రలో కలపండి' అంటూ ఎమ్మెల్యే హరీష్‌బాబు ఘాటుగా వ్యాఖ్యానించారు. బీజేపీ ఎమ్మెల్యే చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో కాకరేపాయి. ఉత్తర తెలంగాణపై వివక్ష ఎందుకు చూపుతున్నారని నిలదీశారు. తుమ్మిడిహెట్టికి కేంద్రం సహకరిస్తుందని అన్నారు. తమ ప్రాంతానికి బ్జడెట్లో నిధుల కేటాయింపులు లేవని ఆవేదన చెందారు. తమకు జీవన ప్రమాణాలు పెంచి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉత్తర తెలంగాణ ప్రజల నోటికాడి ముద్దను లాక్కెళ్లారని మండిపడ్డారు. దక్షిణ తెలంగాణలోని ప్రాజెక్టుల మీద ఉన్న శ్రద్ధ ఉత్తర తెలంగాణ మీద కూడా చూపాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఉమ్మడి ఆదిలాబాద్ మీద వివక్షే, ఇప్పుడు ప్రత్యేక తెలంగాణలో కూడా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మీద వివక్ష చూపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాంతాల అభివృద్ధి కోసం హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు కట్టవచ్చని అన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం కూడా సహకరిస్తుందని చెప్పారు. అవసరమైతే బీజేపీ ఎమ్మెల్యేలు అందరం కలిసి వెళ్లి కేంద్రాన్ని ఒప్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## శ్రీశైలం జలాశయానికి పెరుగుతున్న వరద

### ఏడు క్రస్ట్ గేట్లు ఎత్తి సాగర్‌కు నీటి విడుదల

శ్రీశైలం,జూలై30(నమస్తే ఉదయం):
ఎగువ నుంచి శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం భారీగా పెరుగుతున్నది. దీంతో అధికారులు ఏడు క్రస్ట్‌గేట్లను 10 అడుగులమేర ఎత్తి సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో సాగర్‌కు నీటిరాక పెరిగింది. మంగళవారం జూరాల ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి నుంచి 19,653 క్యూసెక్కులు, క్రస్ట్‌గేట్ల ద్వారా 2,61,543 క్యూసెక్కుల నీరు విడుదలవుతుంది. సుకేశుల నుంచి 1,07,246 క్యూసెక్కుల నీరు విడుదలై సాయంత్రానికి 3,88,460 క్యూసెక్కుల నీరు చేరుకోగా.. రిజర్వాయర్ నుంచి 4,13,178 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదలైనట్లు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటినిల్వ 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 883 అడుగులు ఉన్నది. పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 215 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 207 టీఎంసీలుగా ఉన్నది. కుడిగట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి 25,684 క్యూసెక్కులు, ఎడమగట్టు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి ద్వారా చేసి దిగువకు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. మరో వైపు శ్రీశైలం జలాశయం డ్యామ్ గేట్లు ఎత్తివేయడంతో శ్రీశైలం రహదారులన్నీ పర్యాటకులతో సందడిగా మారాయి. హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు శ్రీశైలం బాటపడుతున్నారు. మరో వైపు రిజర్వాయర్‌కు వరద పెరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందు జాగ్రత్తగా ఎవరూ వెళ్లొద్దని సీఐ ప్రసాదరావు హెచ్చరించారు. మంగళవారం ఉదయం టూరిజంశాఖ అధికారులకు, మత్స్యకారులకు నోటీసులు జారీ చేశారు. నీటి ప్రవాహం తగ్గే వరకు పడవలు నడపొద్దని సూచించారు.

# రైతులను రుణ విముక్తులను చేస్తా..

(మొదటిపేజీ తరువాత)
చేసిన కార్యక్రమంలో రేవంత్ మాట్లాడారు. అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి రెండో విడత రైతు రుణమాఫీ నిధులు విడుదల చేశారు. ఇప్పటికే రూ.లక్ష ఉన్నవారికి రుణమాఫీ పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6,40,223 మందికి రూ.6190.01 కోట్లు నిధులు విడుదల చేశారు. మూడో విడత కింద 17, 75, 235 మంది రైతులకు రూ.12,224.98 కోట్లు విడుదల చేశారు. రాజకీయ ప్రయోజనం కాదు... రైతు ప్రయోజనం ముఖ్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు సంతోషంగా ఉండాలని 6మే 2022న వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రకటించామని.. గత ప్రభుత్వం 60నెలలు నాలుగు విడతల్లో రూ.లక్ష రుణమాఫీ కూడా పూర్తిచేయలేక పోయారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రూ.25వేల కోట్లు కూడా రుణమాఫీ చేయలేకపోయిందన్నారు. అప్పుల్లో కూరుకుపోయిన తెలంగాణ ప్రభుత్వం ఎలా రుణమాఫీ చేస్తుందని కొందరు మాట్లాడారని.. ఎట్టి పరిస్థితుల్లో రుణమాఫీ చేయాల్సిందేనని ప్రణాళికలు రచించాం.. నిధులు సేకరించామని తెలిపారు. నిధుల సమీకరణ చేసి ఇవాళ రెండో విడతలో రూ.6,198కోట్లు ఆరున్నర లక్షల మందికి మేలు జరిగేలా చేస్తున్నామని.. ఇది మా చిత్తశుద్ధి, ఇది మా నిబద్ధత అని ప్రకటించారు. నెహ్రూ ఆనాడు హరిత విప్లవం తీసుకు వచ్చారని.. జై జవాన్, జై కిసాన్ నినాదంతో ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్లిందని రేవంత్ తెలిపారు. పేద రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందించేందుకు ఇందిరమ్మ బ్యాంకుల జాతీయకరణ చేశారని.. సోనియమ్మ నేతృత్వంలో ఆనాడు ఆహార భద్రత చట్టం తీసుకువచ్చారని తెలిపారు. ఆనాడు రూ.72వేల కోట్ల రుణాలు మాఫీ చేసి దేశంలో రైతులను ఆదుకుంది కాంగ్రెస్ అని గుర్తు చేశారు. అప్పుడు.. ఇప్పుడు ఎప్పుడూ కాంగ్రెస్ రైతు పక్షపాతేనన్నారు. నెల తిరిగేలోగా 1.5లక్షల వరకు రైతు రుణమాఫీ చేసి మా చిత్తశుద్ధి నిరూపించుకున్నామని.. ఆగస్టులోగా రూ.2లక్షల రుణమాఫీ పూర్తి చేసి రైతులను రుణ విముక్తులను చేస్తామన్నారు. జులై, ఆగస్టు నెలలు చరిత్రలో లిఖించదగ్గ నెలలు. దేశ చరిత్రలోనే తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ రికార్డు సృష్టించిందన్నారు. స్వతంత్ర భారతంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కూడా ఇంత పెద్దమొత్తంలో రైతు రుణమాఫీ చేయలేదని.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ఆరునెలల్లో ఆర్థిక




మంత్రి రూ.43 వేల కోట్లు వడ్డీ చెల్లించారని ఆరోపించారు. 12 రోజుల్లోనే రుణమాఫీకి 12వేల కోట్లు సేకరించిన ఆర్థిక మంత్రి, వారి సిబ్బందిని అభినందిస్తున్నా నన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున రైతు రుణమాఫీ నిధులు విడుదల చేసేందుకు అసెంబ్లీలోనే ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. రైతులు, పంట పొలాలు, పంటలకు సంబంధించిన అంశాలతో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన సభా వేదికపై నుంచి కార్యక్రమం పూర్తి చేశారు. గతంలో అనేక మంది రైతులు సొంత పొలాల్లోనే పురుగుల మందు తాగి ప్రాణాలు కోల్పోయారు. ఏ రైతు కూడా ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోకూడదనేదే మా విధానం. అందుకే ఇవాళ రూ.లక్షన్నర వరకు ఉన్న రైతు రుణాలన్నీ మాఫీ చేశాం. రాష్ట్రంలోని రైతులందరి ఇళ్లల్లో ఇవాళ పండుగ రోజు. సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు రైతులకు రుణమాఫీ చేశాం. రెండో విడతగా రూ.6,190 కోట్లు మాఫీ చేశాం.' అన్నారు. రుణమాఫీ కింద సుమారు 6.4 లక్షల మంది రైతుల ఖాతాల్లో రెండో విడతగా రూ.6,190 కోట్లు జమ చేసింది. తొలి విడతలో 11.34 లక్షల మంది రైతులకు రూ.6,035 కోట్లు విడుదల చేశారు. ఇప్పటి వరకు 17.75 లక్షల మంది రైతులకు లబ్ది చేకూరింది. రెండు దశల్లో కలిపి రైతుల ఖాతాల్లో రూ.12,225 కోట్లు జమ చేశారు.

గత ప్రభుత్వంలో పూర్తిగా మూలనపడ్డ పంటల బీమా పథకాన్ని పునరుద్ధరిస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రెండో విడత రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా మాట్లాడిన మంత్రి... ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన రుణమాఫీ హామీని నిలబెట్టుకున్నామన్నారు. ఒకే పంటకాలంలో రూ.2 లక్షల మేర రుణమాఫీ చేస్తున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అని కొనియాడారు. ఆయిల్‌పామ్ సరఫరాలో రాబోయే ఐదేళ్లలో రాష్ట్రం అగ్రస్థానంలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ' రైతులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటున్నాం. ఆగస్టులో రూ.2 లక్షల్లోపు ఉన్న రుణమాఫీని కూడా అమలు చేస్తాం. పంటలబీమా ద్వారా రైతులకు అండగా ఉంటాం. త్వరలోనే గతంలో కంటే భిన్నంగా రైతుభరోసా విధివిధానాలు రూపొందిస్తాం. ఐదేళ్లలో 5 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ వేయాలని కోరుతున్నాం. అనేక రాష్ట్రాలకు పామాయిల్ సరఫరా చేసే స్థాయికి మనం చేరాలి. రైతాంగం అనే నినాదానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన అర్థం చెబుతోందని తుమ్మల అన్నారు. రాహుల్ గాంధీ హామీలు ఇచ్చినప్పుడు అందరూ అనుమానాలు వ్యక్తం చేశారని, వారి అనుమానాలను పటాపంచలు చేస్తూ రుణమాఫీ చేస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రైతుల మేలుకోరే రుణమాఫీపై శరవేగంగా నిర్ణయాలు తీసుకున్నామన్నారు.

ఈ సందర్భంగా రెండో విడతగా రుణమాఫీ పొందిన లబ్దిదారులకు ఆయన అభినందనలు తెలిపారు.

## నేటితో ముగియనున్న ఐటి రిటర్న్స్

(మొదటిపేజీ తరువాత)
ఇలాగే పొడిగించలేదు. గడువు దాటిన తర్వాత అపరాధ రుసుముతో చెల్లించే వీలున్నప్పటికీ.. పాత విధానం (క్షటె బిజీలీ స।ణతిప।) ఎంచుకునే వారు మాత్రం ప్రయోజనాలు కోల్పోవాల్సి ఉంటుంది. ఎవరైతే పాత పన్ను విధానంలో ఐటీఆర్ ల్ చేయాలనుకుంటున్నారో పెనాల్టీ చెల్లించడంతో పాటు అదనంగా పన్ను చెల్లించాల్సి రావొచ్చు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆడిట్ అవసరం లేని వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు జులై 31లోపు ఐటీఆర్‌ను ఫైల్ చేయాల్సి ఉంటుంది. అయితే, ప్రస్తుతం రెండు రకాల పన్ను విధానాలు అమల్లో ఉన్నాయి. అందులో కొత్త పన్ను విధానమే డిఫాల్ట్‌గా ఉంటుంది. గడువులోపు ఐటీఆర్ దాఖలు చేస్తే ఏది ప్రయోజనకరమైతే ఆ విధానానికి మారే అవకాశం ఉంటుంది. నిర్దేశిత గడువు దాటిన తర్వాత కొత్త పన్ను విధానం మాత్రమే అమల్లో ఉంటుందని ఐటీఆర్ వెబ్‌సైట్ పేర్కొంటోంది. అంటే పాత పన్ను విధానం ఎంచుకునే ఆప్షన్ ఉండబోదు. డెడ్‌లైన్ ముగిశాక బిలేటెడ్ ఐటీఆర్‌ను కేవలం కొత్త పన్ను విధానంలో మాత్రమే దాఖలు చేయాల్సి ఉంటుంది. దీనివల్ల పాత పన్ను విధానంలో మినహాయింపులు క్లెయిమ్ చేసుకునే అవకాశాన్ని ట్యాక్స్‌పేయర్లు కోల్పోతారు. దానివల్ల కొత్త పన్ను విధానం కింద అదనంగా పన్ను చెల్లించాల్సి రావొచ్చు. మరోవైపు ఇ-ఫైలింగ్ పోర్టల్‌లో ఇప్పటికీ చిన్న చిన్న సమస్యలు వెంటాడుతున్నాయి. దీంతో కొందరు యూజర్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో పాటు గడువు పెంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు. గడువు పెంచే ఉద్దేశమేదీ లేదని ఆదాయపు పన్ను శాఖ ఇప్పటికే స్పష్టంచేసింది. జులై 30వ తేదీ వరకు 6 కోట్ల మందికి పైగా రిటర్నులు దాఖలు చేయగా.. అందులో 70 శాతం మంది కొత్త పన్ను విధానాన్నే ఎంచుకున్నారని రెవెన్యూ శాఖ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా వెల్లడించారు.

## వయనాడ్ విపత్తులో పెరుగుతున్న మృతులు

(మొదటిపేజీ తరువాత)
చర్యలు చేపట్టారు. కొంతమంది బాధితులను సమీపంలోని చురల్‌మల స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన సహాయక శిబిరానికి పంపించారు. అయితే ప్రమాదవశాత్తూ తెల్లవారుజామున 4 గంటలకు ఈ స్కూల్ సమీపంలో మరోసారి కొండచరియలు పడ్డాయి. దీంతో శిబిరం సహా చుట్టుపక్కల ఇళ్లు, దుకాణాలు బురదలో కొట్టుకుపోయాయి. కొండచరియల పడటంతో వందల సంఖ్యలో ఇళ్లు ధ్వంసమయ్యాయి. అనేక వాహనాలు కొట్టుకు పోయాయి. చురల్‌మలలో కొంత భాగం తుడిచి పెట్టుకుపోయింది. అనేక మంది శిథిలాల కింద చిక్కుకుని సాయం కోసం ఆర్తనాదాలు చేస్తున్నారు. వీరిని కాపాడేందుకు సహాయక బృందాలు రంగంలోకి దిగాయి. ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ సాయంతో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. అయితే ఎడతెరిపి లేని వర్షం కారణంగా సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. ముండకైలో ఈ మధ్యాహ్నం మరోసారి కొండచరియలు విరిగిపడినట్లు సమాచారం. వరద, బురద ప్రవాహంతో వందల మంది కొట్టుకుపోయినట్లు సమాచారం. వారి ఆచూకీ కోసం సహాయక బృందాలు గాలింపు చేపడుతున్నారు. డ్రోన్లు, జాగిలాలతో అన్వేషణ సాగిస్తున్నారు.

## తాము కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం..

(మొదటిపేజీ తరువాత)
మంగళవారం నాడు అసెంబ్లీ మీడియా పాయింట్‌లో తెల్లం వెంకట్రావ్ చిట్‌చాట్ చేశారు. బీఆర్ఎస్‌లో కొందరు అల్ప సంతోషులు ఉన్నారని విమర్శించారు. తన ఫొటో తీసి పార్టీ మారుతారని ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. చాలా మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ మంత్రుల చాంబర్‌లకు వచ్చి కలుస్తున్నారు.. వారంతా పార్టీ మారేవారేనా అని ప్రశ్నించారు. తాను పార్టీ మారే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ తోనే తన ప్రయాణమని తేల్చిచెప్పేశారు. తాను పార్టీ మారే ప్రసక్తే లేదని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని అన్నారు. తెల్లం వెంకట్రావ్ ఫొటో కావాలని తీసి వైరల్ చేశారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయ సహకారం తనకు ఉందని కాలే యాదయ్య తెలిపారు. మరోవైపు.. ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ వైపు వెళ్లడం లేదని అదంతా గులాబీ నేతలు చేసుకుంటున్నా ప్రచారమేనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు ఎక్కడికి పోరని తేల్చిచెప్పారు. మంగళవారం నాడు అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్ చాట్ చేశారు. పాత పరిచయం కాబట్టి కలసి ఉంటారని అన్నారు. తమ దగ్గరకి వచ్చిన నేతలు ఎవరు ఇబ్బంది కలగకుండా ఉంటారని చెప్పారు. తమ దగ్గర ప్రేమ రాజకీయాలు ఉంటాయని అన్నారు. ఎవరు ఎక్కడికి పోరని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

## బిఆర్ఎస్ కొత్త డ్రామాలకు తెర

(మొదటిపేజీ తరువాత)
పోరని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు..తిరిగి సొంతగూటికి చేరుతున్నారని వస్తున్న వార్తలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. చాంబర్ కు వెళ్లినంత మాత్రానా పార్టీలో చేరినట్లా అని ప్రశ్నించారు. కేటీఆర్ కూడా నా చైర్ దగ్గరకు వచ్చి మాట్లాడారా?. ఆయన కాంగ్రెస్ లో చేరినట్లేనా అని అన్నారు. బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అలాగే కలిసి ఉంటాడు.. ఆయన ఎక్కడికి వెళ్లడు అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గట్టిగా చెప్పారు. జగదీష్ రెడ్డి నేను అన్న మాటలకు ఒప్పుకున్నారు.. సీఎంరేవంత్ రెడ్డి ఫారిన్ వెళ్లే నేను ఉన్నాగా చూసుకోవడానికి .. బీఆర్ ఎస్ నేతలకు నేను చాలు అని వార్నింగ్ ఇచ్చారు. త్వరలో ప్రధానిని కలుస్తా.. రాష్ట్ర రహదారుల కోసం నిధులు అడుగుతా అన్నారు. బీఆర్ ఎస్ ఎత్తేసిన అన్ని వ్యవసాయ పనిముట్లను సబ్సిడీ ఇస్తామన్నారు. ఉప్పల్- నారపల్లి ఫ్లై ఓవర్ కు త్వరలోనే రీ టెండర్ పిలుస్తామన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. వర్షాకాలంలో ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా రోడ్డు మరమ్మత్తు పనులు చేపడతామన్నారు. ఎస్ ఎల్ బీసీ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష పాత చాలా కీలకమైనది.. కేసీఆర్ అసెంబ్లీకి రానప్పుడే ఆ పార్టీపై ఆశలు వదులుకున్నారు. కేసీఆర్ కు ప్రజలమీద ప్రేమ లేదన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు ముగ్గురు కలిసి రేవంత్ రెడ్డిని ఓడించలేకపోయారు అని అన్నారు. ఎమ్మెల్యేలు ఎవరు బీఆర్ఎస్ వైపు వెళ్లడం లేదని విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్ చాట్ చేశారు. బీఆర్ఎస్ నేతలు కావాలని ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌కు అక్కడి స్థానిక పరిస్థితులు ఎలా ఉన్నాయో తెలియదని అన్నారు. బీఆర్ఎస్ కావాలనే లీక్‌లు ఇస్తుందని చెప్పారు. కాంగ్రెస్‌లోకి వచ్చిన అందరూ ఎమ్మెల్యేలు పార్టీలోనే ఉంటారని.. బీఆర్ఎస్ నుంచి ఇంకా ఎమ్మెల్యేలు వస్తారని ఆది శ్రీనివాస్ తేల్చిచెప్పారు. తాను కచ్చితంగా మంత్రిని అవుతానని కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఏ శాఖకు మంత్రి అవుతాననేది మాత్రం చెప్పలేనని అన్నారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యేను తానని గుర్తుచేశారు. తనకు మంత్రి పదవి రాకుండా ఎలా ఉంటుందని ప్రశ్నించారు. మంగళవారం నాడు మీడియాతో చిట్ చాట్ చేశారు. రాష్ట్ర జనాభాలో 40శాతం జనాభా హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల్లో ఉన్నారని స్పష్టం చేశారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలను విస్మరించినట్లేనని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఇదిలావుంటే బిఆర్ఎస్ పార్టీలో బి తొలగించి తిరిగి టి పెట్టే దమ్ముందా అని మాజీ మంత్రి కేటీఆర్‌కు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సవాల్ విసిరారు. డిఎంకె, టిఎంసి లాంటి పార్టీలకు ఒక ఫిలాసఫీ ఉందని బీఆర్ఎస్‌కి ఏ ఫిలాసిఫీ ఉందని ప్రశ్నించారు. అధికారం ఉన్నపుడే బీఆర్ఎస్ కాంగ్రెస్‌ను ఏం చేయలేకపోయిందని.. ఇప్పుడేం చేస్తారని అన్నారు.గద్వాల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డికి ఓపిక లేదని.. నియోజకవర్గంలో ఆయన చెప్పినట్లు పార్టీ యావత్ ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయన మనుషులకు అవకాశాలు ఉండాలి అని అడిగారని.. దానికీ కుడా సరే అన్నామని చెప్పారు. జిల్లాలో బీసీ మహిళా అయిన జెడ్పీ చైర్మన్‌ను ఎక్కడికి రావొద్దన్నారని.. ఆమెను అధికార కార్యక్రమాలకు పిలవద్దు అన్నారని ఇది సాధ్యం కాదని తేల్చి చెప్పామని అన్నారు. మంగళవారం నాడు శ్రీనివాస్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఒక ఎమ్మెల్యే అయి ఉండి పార్టీలో అధికారులపై గ్రిప్ సంపాదించుకోవాలన్నారు. రాష్ట్రంలో పథకాలు అమలు కావడం లేదన్నారని.. అన్నీ చేసి చూపిస్తున్నామని తెలిపారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌లో కుంభకోణం గురించి ప్రజలందరికి తెలుసునని చెప్పారు.

## పెన్షన్ల జాప్యంపై సుప్రీం కోర్టు ఆగ్రహం

(మొదటిపేజీ తరువాత)
కూడిన ధర్మాసనం విచారణ జరిపింది.భారత సైన్యంలో రిటైర్డ్ రెగ్యులర్ కెప్టెన్లకు చెల్లించే పెన్షన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకోకపోవడంపై భారత సర్వోన్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్' పథకం ప్రకారం పింఛను చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైందని, ఈ పక్రియలో ఏళ్లతరబడి జాప్యం చేస్తోందని మండిపడింది. ఈ క్రమంలో కేంద్రానికి రూ.2 లక్షల జరిమానా విధించింది. ప్రభుత్వానికి చివరి అవకాశం ఇచ్చిన సర్వోన్నత న్యాయస్థానం.. నవంబర్ 14లోగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించింది. లేదంటే పెన్షన్ పెంపుపై తామే ఆదేశాలు ఇవ్వాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ క్రమంలో ఏళ్లతరబడి ప్రభుత్వం ఓ నిర్ణయానికి రాకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నాళ్లు ఇది కొనసాగుతుంది? 2021 నుంచి ఈ వ్యవహారంపై చర్చ జరుగుతోంది. అయినా నిర్ణయం తీసుకోలేదు' అని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. నవంబర్ 14లోగా తుది నిర్ణయం తీసుకోకుంటే రిటైర్డ్ రెగ్యులర్ కెప్టెన్లకు 10శాతం పెన్షన్ పెంచేలా తామే ఆదేశాలు ఇస్తామని హెచ్చరించింది. కేంద్రం తరఫున హాజరైన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భట్టీ వాదిస్తూ.. క్షమాపణలు మాత్రమే చెప్పగలను. మాకు మరో అవకాశం ఇవ్వండి.

ఈ విషయంపై నిర్ణయం తీసుకుంటాం. మూడు నెలల గడువు ఇవ్వండి' అని విజ్ఞప్తి చేశారు. ఇందులో ఆరు సమస్యలున్నాయని.. వీటిని పరిశీలించాల్సి ఉందన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని, ఇందుకోసం మరో అవకాశం ఇవ్వాలని కోరారు. తొలుత అందుకు న్యాయస్థానం నిరాకరించినప్పటికీ.. చివరగా ఓ అవకాశం ఇస్తున్నట్లు పేర్కొంది.

## సొంతగూటికి గద్వాల ఎమ్మెల్యే

(మొదటిపేజీ తరువాత)
బీఆర్ఎస్‌లోనే ఉంటానంటూ రిటర్న్ అయ్యారు. ఇటీవలే కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన.. ఇప్పుడు మనసు మార్చుకుని సొంత పార్టీలోకి వచ్చేశారు. మంగళవారం నాడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన ఆయన.. తాను మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. అయితే, కృష్ణమోహన్ ఘర్‌వాపసీతో కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగలగా.. బీఆర్ఎస్‌లో జోష్ పెరిగింది. ఈ నేపథ్యంలోనే ఇప్పటి వరకు పార్టీని వీడి వెళ్లిన మిగతా ఎమ్మెల్యేలను సైతం తిరిగి రిప్పించే ప్రయత్నాలను ముమ్మరం చేసింది బీఆర్ఎస్ అధిష్టానం. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ సైతం మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇవాళ మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డిని తెల్లం వెంకట్రావ్ కలిశారు. అనంతరం కేటీఆర్‌తో భేటీ అయ్యారు. ఇవాళో రేపో ఆయన కూడా బీఆర్ఎస్‌లోకి పునరాగమనం చేస్తారని గట్టి ప్రచారమే నడుస్తోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 39 స్థానాల్లో మాత్రమే గెలుపొంది.. రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయింది. దీంతో ఆ పార్టీ తరఫున గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు వరుసగా బీఆర్ఎస్‌ను వీడటం మొదలుపెట్టారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. దాదాపు తొమ్మిది మంది ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. వీరే కాదు.. ఇంకో పది మందికి పైగా ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతారని, బీఆర్ఎస్‌కు విపక్ష హోదా ఉండని కాంగ్రెస్ నేతలు గట్టి ప్రకటనలే చేశారు. ఆషాఢమాం అయిపోయిన తరువాత సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలోనే చాలా మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువా కప్పుకుంటారని హస్తం పార్టీ నేతలు జోరుగా ప్రచారం చేశారు. ప్రకటనల పరంపర ఇంకా కొనసాగుతూనే ఉంది. అయితే, ఇక్కడే చిన్న ట్విస్ట్ చోటు చేసుకుంది. ఓవైపు చేరికలుంటాయని భావించిన కాంగ్రెస్‌కు.. ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి రూపంలో రివర్స్ షాక్ తగిలింది. కాంగ్రెస్ వద్దు బీఆర్ఎస్ కావాలి అంటూ రిటర్న్ అయ్యారు. ఈయనొక్కరే కాదు.. ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మరి కొందరు ఎమ్మెల్యేలు సైతం తిరిగి సొంత గూటికి చేరుతారని ప్రచారం జరుగుతోంది.



నర్సాబాయ్ కుంటను పరిశీలిస్తున్న స్థానిక నాయకులు

## నర్సవాయికుంటను ఆధునికరించాలి

**దుర్వాసన భరించలేకపోతున్నాం**

**బాబుల్ రెడ్డి నగర్, మార్కండేయ నగర్ ప్రజల ఆవేదన**

రాజేంద్రనగర్, జూలై 30(నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బాబు రెడ్డి నగర్, మార్కండేయ నగర్ బస్తీలకు ఆనుకొని ఉన్న నర్సా బాయ్ గుంట మురికి కోపంగా మారడంతో దోమల బెడద, దుర్వాసన భరించలేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జలమండలి, జిహెచ్ఎంసి అధికారుల సమన్వయ లోపం కారణంతో స్థానిక ప్రజలు అనారోగ్యాలకు పాలవుతున్నారు. ఈ చెరువును ఆధునికరించడానికి నిధులు మంజూరైన అధికారుల నిర్లక్ష్యం కారణంగా పనులు జరగలేదని స్థానిక నాయకులు ఎస్ వెంకటేష్, సోమ శ్రీనివాస్ గుప్తా, ప్రజలు ఆరోపిస్తున్నారు. చెరువు కు ఇరిగేషన్ అధికారులు ఎఫ్ టి ఎల్ ను నిర్ధారించకపోవడంతో ఆక్రమణకు గురవుతోందని స్థానిక ప్రజలు అంటున్నారు. రెవెన్యూ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారులు చెరువులు కబ్జా కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. జిహెచ్ఎంసి అధికారులు వెంటనే స్పందించి నర్సబాయి కుంట ను ఆధునీకరించి సుందరీకరణ చేస్తే స్థానిక ప్రజలకు మేలు జరుగుతుందని కోరుతున్నారు.

## ఆరంగర్ వద్ద రోడ్డును ఆధునికరించాలి

**రోడ్డు గుంతల మయంగా మారటంతో ట్రాఫిక్ తరచుగా జామ్**

**పట్టించుకోని అధికారులు..**

**ఇబ్బందులు పడుతున్న వాహనదారులు**

రాజేంద్రనగర్, జూలై 30(నమస్తే ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆరాంఘర్ చౌరస్తాలో రైల్వే ట్రాక్ కింద రోడ్డు గుంతల మయంగా మారడంతో ట్రాఫిక్ రద్దీతో జామ్ అవుతోంది. ఈ దారి గుండా ప్రతిరోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షం పడింది అంటే చాలు రైల్వేట్రాక్ బ్రిడ్జికింద చెరువును తలపించే వర్షపునీరు చేరడంతో వాహనాలు రాక పోకలు సాగించలేకపోతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు




ఆరంఘర్ నుండి దుర్గా నగర్ వరకు ట్రాఫిక్‌తో నిలిచిపోయిన వాహనాలు

నీరు వెళ్లటానికి జిహెచ్ఎంసి అధికారులు సరియైన మార్గం ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ట్రాఫిక్ జామ్ అవుతుందని వాహన దారులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు మర మ్మత్తులు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని వాహనదారులు కోరుతున్నారు.

## టిజిఎస్‌పిడిసిఎల్ సీఎండికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అధికారులు

మెహదీపట్నం, జూలై 30(నమస్తే ఉదయం): టిజిఎస్ పిడిసిఎల్ సీఎం డి ముషారఫ్ జన్మదిన వేడుకలు మెహదీపట్నంలోని విద్యుత్ రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం సిఎండి ముషారఫ్ జన్మదిన సందర్భంగా జిఎం ఆనంద్, ఎస్ ఈలు ఎల్ గోపయ్య,



టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ జన్మదిన సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ఏఓ వీరస్వామి, అకౌంట్ ఆఫీసర్ మురళి గౌడ్

ఎం వెంకన్న, ఎస్ఏఓలు వీరస్వామి, రవికుమార్, డిఈటిలు దామోదర్ రావు, రామచంద్రయ్యలు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అకౌంట్స్ ఆఫీసర్లు మురళీధర్ గౌడ్, హరిచంద్ర శేఖర్, రవీందర్, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## నేల ఆరోగ్యంపై జరిగిన సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు

రాజేంద్ర నగర్, జూలై30(నమస్తే ఉదయం): మానవ మనుగడకి ప్రధాన ఆధారమైన నేలను రక్షించుకోవలసిన బాధ్యత మన అందరి పైన ఉందని ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్, పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.రఘురామి రెడ్డి అభిప్రాయ పడ్డారు. సహజ వనరుల విచక్షణారహిత వాడకాన్ని తగ్గిస్తూ, నేల సారం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చర్యలు తీసుకోవాలన్నారు. భావితరాలకు కాలుష్య రహిత వనరులను అందిస్తూ, ఆహార ధాన్యాల ఉత్పత్తిలో నెలకొన్న స్తబ్దతని అధిగమించాలని రఘు రామిరెడ్డి సూచించారు. దీర్ఘకాలిక ఎరువుల విధానం, జీవన ఎరువులు, దీర్ఘకాలిక ఎరువుల యాజమాన్యం, సూక్ష్మ పోషకాలు, భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల సిఫార్సు విధానం అంశాలపై పరిశోధనలు సాగిస్తున్న దక్షిణాది రాష్ట్రాలు, చత్తీస్ ఘడ్ రాష్ట్ర అఖిల భారత సమన్వయ పరిశోధన ప్రాజెక్టుల పరిశోధన ప్రగతిని సమీక్షించడానికి ఉద్దేశించిన సదస్సు మంగళవారం రాజేంద్రనగర్‌లోని విస్తరణ విద్యాసంస్థలో ప్రారంభమైంది. ఈ సదస్సు మూడు రోజులపాటు జరగనుంది. రిజిస్ట్రార్, పరిశోధన సంచాలకులు పి.రఘురామి రెడ్డి ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

జమ్ములోని షేర్ - ఇ - కాశ్మీర్ (యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ టెక్నాలజీ) వ్యవసాయ విశ్వవిద్యాలయం, మాజీ ఉపకులపతి డాక్టర్ పి.కె.శర్మ చైర్మన్‌గా ఏర్పాటైన ఎనిమిది మంది సభ్యుల బృందం భోపాల్‌లోని భారత మృత్తికా శాస్త్ర సంస్థ ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సదస్సులో ఐదు



అఖిల భారత సమన్వయ పరిశోధన ప్రాజెక్టుల సమన్వయకర్తలు డాక్టర్ ఎస్.శ్రీవాత్సవ, డాక్టర్ ఎస్ కె బెహరా, డాక్టర్ ఆర్ హెచ్ వంజరి, డాక్టర్ ఎస్ మహంతి, డాక్టర్ ఎ కె బిశ్వాస్ లతో పాటు దక్షిణ తెలంగాణ మండల సహా పరిశోధనా సంచాలకులు డాక్టర్ ఎం.మల్లా రెడ్డి, మృత్తికా ఆరోగ్య యాజమాన్య సంస్థ, రాజేంద్ర నగర్ బాధ్యులు డాక్టర్ ఎ.మాధవి, పరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్ కె. పవన్ చంద్రా రెడ్డి, డాక్టర్ ఎం.శంకరయ్య, డాక్టర్ టి.సుకృత్ కుమార్‌లు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాజేంద్రనగర్‌లోని మృత్తికా యాజమాన్య సంస్థ దీర్ఘకాలిక ఎరువుల యాజమాన్య విభాగం, జగిత్యాల వ్యవసాయ పరిశోధన స్థానం రూపొందించిన ప్రచురణల్ని విడుదల చేశారు.

## బాబుల్ రెడ్డి నగర్ బస్తీలో వెండి తొట్టెల ఊరేగింపు..

**పోతురాజుల విన్యాసాలు..**
**యువకుల నృత్యాలు..**
**పోటెత్తిన జనం**

**అమ్మవారిని దర్శించుకున్న మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేశ కురుమ**

రాజేంద్రనగర్, జులై 30(నమస్తే ఉదయం): పోతురాజుల విన్యాసాలు..యువకుల నృత్యాలు.. బ్యాండ్ బాజాలు,డీజే చప్పుళ్ల మధ్య బాబుల్ రెడ్డి నగర్ బొడ్రాయి దగ్గర నుండి పురవీధుల్లో మంగళవారం అంగరంగ వైభవంగా వెండి తొట్టెల ఊరేగింపులు కొనసాగింది.



బాబుల్ రెడ్డి నగర్‌లో జరిగిన భవనాల ఉత్సవాలలో పోతురాజులతో మాజీ కౌన్సిలర్ వెంకటేష్

కార్తీక్ ముదిరాజ్ చేయించిన వెండి తొట్టెల పోచమ్మ దేవాలయం వరకు భజ భజంత్రీలతో అమ్మవారి వేషధారణ కన్నుల పండుగగా ఊరేగింపు కొనసాగింది. అడుగడుగునా భక్తజనం ఆనంద పారవశ్యంలో మునిగింది.వెండి తొట్టెల ఊరేగింపులో మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేశ కురుమ పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

వెండి తొట్టెల ఊరేగింపులో ఆర్.కుమార్ ముదిరాజ్, అశోక్ కుమార్, ఉమ్మడి దేవాలయ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్, రవి ముదిరాజ్, కిషోర్, నరేష్ ముదిరాజ్, సెంట్రింగ్ శంకర్, డీఎస్ కె.శివ, తిమ్మప్ప,భక్తులు పాల్గొన్నారు.





ప్రమాదరహిత వారోత్సవాల ముగింపులో పాల్గొని మాట్లాడుతున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ నర్సింహులు

## ఉత్తమ డ్రైవర్‌లను సన్మానిస్తున్న అధికారులు

**ఆర్టీసీలో ముగిసిన ప్రమాద రహిత వారోత్సవాలు**

రాజేంద్ర నగర్, జూలై30 (నమస్తే ఉదయం): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించిన ప్రమాద రహిత వారోత్సవాలు మంగళవారం ముగిసాయి. ఇందులో భాగంగా మంగళవారం రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపోలో ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సమావేశంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్ పెక్టర్ నర్సింహులు, ఎస్ఐ రవీందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు నర్సింహులు మాట్లాడుతూ, ప్రమాదాల నివారణ కు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డ్రైవర్లకు వివరించారు. అదేవిధంగా రాజేంద్ర నగర్ డిపోలో గత 29 సంవత్సరాల నుంచి ఒక్క యాక్సిడెంట్ కూడా చేయకుండా యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్‌గా మొదటి స్థానంలో నిలిచిన మహమ్మద్ హమీద్, 28 సంవత్సరాల నుంచి ఒక్క యాక్సిడెంట్ కూడా చేయకుండా యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్‌గా రెండవ స్థానంలో నిలిచిన జి.సురేందర్, 27 సంవత్సరాల నుంచి ఒక్క యాక్సిడెంట్ కూడా చేయకుండా యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్‌గా మూడవ స్థానంలో నిలిచిన బి.ఎస్.రెడ్డిలను సన్మానించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ బద్రీ నారాయణ,అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్, మెకానికల్ ఇంజనీర్ నిలీమ, ఎస్.టి.ఐ.సుశీలతో పాటు డిపో సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి జీఐఎస్ సర్వే..

**ఏడు ప్రాంతాల్లో ప్రారంభించనున్న జీహెచ్ఎంసీ**

హైదరాబాద్,జులై 30(నమస్తే ఉదయం): జీహెచ్ఎంసీ ప్రస్తుత ఇన్‌ఫర్‌మేషన్,టెక్నాలజీని వినియోగించుకుంటూ మరింత మెరుగైన,సురక్షితమైన సేవలందించేందుకు జీహెచ్ఎంసీ ప్రస్తుత ఇన్‌ఫర్‌మేషన్,టెక్నాలజీని వినియోగించుకుంటూ మరింత మెరుగైన,సురక్షితమైన సేవలందించేందుకు సిద్ధమవుతుంది.నేటి నుంచి నగరంలోని ఏడు ప్రాంతాల్లో జీఐఎస్ ఇంటిగ్రేటెడ్ సర్వే ఫర్ అర్బన్ ప్లానింగ్ నిర్వహించనుంది.సర్వేను తొలుత ఉప్పల్, హయత్‌నగర్,హైదర్‌నగర్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీ, మియాపూర్, చందానగర్ ఏరియాల్లో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.ప్రస్తుతం కేవలం ఆస్తి పన్ను పెంచుకునేందుకు నిర్వహిస్తున్న డ్రోన్ సర్వే అనంతరం అన్ని రకాల సేవల కోసం డ్రోన్ సేవలను విస్తరించేందుకు జీహెచ్ ఎంసీ సిద్ధమైంది. ఇందుకోసం అయిదుగురు అధికారులను ఇటీవలే గుర్గావ్,ముంబై నగరాలకు అధ్యయనం నిమిత్తం




పంపినట్లు సమాచారం.ఈ రెండు మహానగరాల్లో అక్కడి స్థానిక సంస్థలు ప్రజలకు ఒక్క క్యూఆర్ కోడ్‌తోనే స్థానిక సంస్థ అందిస్తున్న ఈఎస్ఆర్ఐ సేవలతో పాటు శాంతి భద్రతలకు సంబంధించిన సేవలను అందిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.తొలుత రెండు రకాల సేవలు..జీహెచ్ఎంసీ పరిధిలో తొలి దశగా రెండు రకాల సేవలనందించేలా వన్ క్యూఆర్ కోడ్‌ను ప్రవేశపెట్టనున్నారు. అక్రమ నిర్మాణాలను పసిగట్టడంతో పాటు రాత్రిపూట డ్రోన్లతో నిఘాను ఏర్పాటు చేసి నేరాలను అదుపు చేసే దిశగా ఈ వన్ క్యూ ఆర్ కోడ్ ఆల్ సర్వీస్ సిస్టమ్ అందుబాటులోకి తెచ్చే దిశగా ఈ సర్వేను నిర్వహించనున్నట్లు సమాచారం.ఆదాయం పెంపు దిశగా బల్దియా అడుగులు..తొలి దశగా ఎంపిక చేసిన ఏడు ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేయనున్న ఈ సర్వేను నగరంలోని అన్ని ప్రాంతాల్లో గరిష్ఠంగా 18 నెలల్లో పూర్తి చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. రెసిడెన్షియల్ ట్యాక్స్ చెల్లిస్తూ కమర్షియల్ కార్యకలాపాలను కొనసాగిస్తున్న భవనాల ప్రాపర్టీ ట్యాక్స్‌ను కమర్షియల్ ట్యాక్స్ కిందకు తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు.ఈ సర్వేతో జీహెచ్ఎంసీకి ఇప్పటి వరకు ఏటా వస్తున్న రూ.1900 కోట్ల ప్రాపర్టీ ట్యాక్స్‌కు అదనంగా రూ.వెయ్యి కోట్లు రావచ్చునన్న అంచనాలతో ఈ సర్వే చేపడుతున్నట్లు సమాచారం.అనంతరం ఇదే సమాచారంతో ఒక్కో ప్రాపర్టీకి ఒక్కో క్యూఆర్ కోడ్ కేటాయించి,జీహెచ్ఎంసీ సేవలన్ని అందించేందుకు వినియోగించనున్నట్లు సమాచారం.

## కళ్యాణలక్ష్మి పేదింటి ప్రజలకు వరం

**- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్**

మెదక్ జిల్లా ప్రతినిధి, జూలై 30(నమస్తే ఉదయం): ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒకరికి సంక్షేమ పథకాలు అందజేస్తుందని మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ అన్నారు. మంగళవారం నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని హావేళీఘణాపూర్ మండలంలో 53 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ మాట్లాడుతూ... కళ్యాణలక్ష్మి పథకం పేదింటి ప్రజలకు వరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

జనరల్ న్యూస్ GENERAL NEWS
బుధవారం ● 31, జులై 2024
నమస్తే ఉదయం
తెలుగు దినపత్రిక




## జిహెచ్ఎంసి రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఖాదర్ బదిలీ

**ఏసీబీ ఖాదర్‌ను ఘనంగా సన్మానించి వేడుకలు పలికిన అధికారులు, సిబ్బంది**

**రాజేంద్రనగర్, జూలై 30(నమస్తే ఉదయం):** రాజేంద్ర నగర్ జిహెచ్ఎంసి అసిస్టెంట్ సిటీ ప్లానర్(ఏసీబీ) అబ్దుల్ ఖాదర్ బదిలీ అయ్యారు. జిహెచ్ఎంసిలో దీర్ఘకాలంగా జిహెచ్ఎంసిలో బదిలీలో భాగంగా సాధారణ బదిలీలలో ఏసీబీ ఖాదర్ బదిలీ అయ్యారు. మంగళవారం బదిలీ అయిన ఏసిపి ఖాదర్ ను సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కే రవికుమార్ ఆధ్వర్యంలో సర్కిల్ ప్రాజెక్ట్ అధికారిని రాధా రాణి, టౌన్ ప్లానింగ్ సిబ్బంది రమేష్, కరణ్, లతపాటు మహిళా సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ రవికుమార్ మాట్లాడుతూ... సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీగా పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఖాదర్ ఎన్నో సమస్యలు పరిష్కరించారు అక్రమ నిర్మాణాలు, పార్కులు, సెప్టిక్ ట్యాంకుల స్థలాలను కబ్జా చేసిన వారిపై కొరడా ఝులిపించి స్వాధీనం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు.రాజేంద్ర నగర్ కు కొత్త ఏసిపిని రాజేంద్ర నగర్ ఒకటి లేదా రెండు రోజుల్లో రానున్నారని డిప్యూటీ కమిషనర్ రవికుమార్ తెలిపారు.

## శివరాంపల్లి ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ వేడుకలు

**రాజేంద్రనగర్, జూలై30(నమస్తే ఉదయం):** కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం నాలుగో వార్షికోత్సవం పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 22 నుంచి 28 వ తేదీ వరకూ వారం రోజుల పాటు రంగారెడ్డి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో శిక్షా సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మంగళవారంతో ముగిసింది. శివారాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ముగింపు కార్యక్రమంలో




శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన శిక్ష సప్తహ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పడమటి శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సభా అద్యక్షులు, పాఠశాల ప్రదానోపాధ్యాయులు కిషన్ మాట్లాడుతూ వారం రోజులుగా కార్యక్రమం విజయవంతంగా జరగడానికి సహకరించినందుకుగానూ ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాద్యాయుల నరసింహచారి మాట్లాడుతూ 'పాఠశాలకు ట్రాన్స్ఫర్ మీద వచ్చిన ఉపాద్యాయుల కొత్త పాత అనే భేదం లేకుండ సహకరించడం అభినందనీయం' అన్నారు. శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులలో ఉన్న నైపుణ్యాన్ని వెలికితీయుట లో ఉపాద్యాయుల కృషి అభినందనీయం అన్నారు. విద్యార్థులు తమలో ఉన్న నైపుణ్యాలకు సాన పెట్టుకొని క్రమశిక్షణ గల పౌరులుగా ఎదగాలని అన్నారు.

## మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసేంతవరకు పోరాటాలు చేస్తాం..

**మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి డిమాండ్**

**హైదరాబాద్, జూలై 30(నమస్తే ఉదయం):** తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాప్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఇంద్ర పార్క్ దగ్గర తమ సమస్యలపై ధర్నా చేశారు .ఈ సందర్భంగా మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో అన్ని రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు పర్మినెంట్ చేసేంతవరకు కార్మికులందరికీ కనీస వేతనాలు 26 వేల రూపాయలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని మున్సిపల్ శాఖ సీఎం ఎనుముల రేవంత్ రెడ్డి చూస్తున్నారు ముఖ్యమంత్రి పారిశుద్ధ్య కార్మికుల సమస్యల మీద అసెంబ్లీలో మాట్లాడి కనీస వేతనాలు అమలు చేస్తానని






ధర్నాలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు, కార్మికులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఏఐటీయూసీ నాయకులు వనంపల్లి జైపాల్ రెడ్డి

నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రజల ఆరోగ్యాల పట్ల నిరంతరం శ్రమిస్తున్న మున్సిపల్ సిబ్బందిని అడుగడుగున వివక్షతకు గురవుతున్నారని అన్నారు.

పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికుల ఫేస్ స్కానర్ హాజరు పేరుతో కార్మికుల జీతాలకు కోతలు విధిస్తున్నారనీ విధులు నిర్వహించిన కూడా టెక్నికల్ సమస్యలతో కార్మికుల జీతాలు కట్ అవుతున్నాయని తీవ్రంగా మండిపడ్డారు. శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లకు అందరికీ జిహెచ్ఎంసి సంస్థ నుండి హాజరు తీసుకోవడానికి సెల్ ఫోన్లో ఇవ్వాలి నెట్ సౌకర్యం కల్పించాలి ఉన్నారు కార్మికుల విధి నిర్వహణలు మరణిస్తే 25 లక్షల రూపాయలు ఇవ్వాలన్నారు అనేకమైనటువంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లు మలేరియ డిపార్ట్మెంట్ కార్మికులు మున్సిపల్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 2013 భూ సేకరణ చట్టం ప్రకారం

# నష్టపరిహారం చెల్లించాలి

**ఆర్బిట్రేషన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి**

**రెండవ విడత భూసేకరణ సందర్భంగా ఇచ్చిన అవార్డు ప్రకారం మొదటి విడత రైతులకు కూడా నష్టపరిహారం పెంచి ఇవ్వాలి**

**మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నరసింహారెడ్డి**




గద్వాల కలెక్టర్ బి.ఎస్ సంతోష్‌కు వినతిపత్రం అందజేయ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 30(నమస్తే ఉదయం):** భారత్ మాల రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులందరికీ 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నరసింహారెడ్డి డిమాండ్ చేశారు.

మంగళవారం గద్వాల్‌లోని వాల్మీకి కమ్యూనిటీ హాల్లో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న అధ్యక్షతన జరిగిన నిర్వాసిత రైతుల జిల్లా సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కార్యా లయం ముందు బైఠాయించి ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూమికి బహిరంగ మార్కెట్లో ఉన్న ధరకు అదనంగా ఇవ్వాలని ముందుగా రైతులందరితో సమావేశాన్ని ఏర్పాటు చేసి వారి అభిప్రాయ సేకరణ మేరకే భూమి తీసుకోవాలని కానీ చట్ట ప్రకారం కాకుండా రైతులను భయభ్రాంతులకు గురిచేసి భూమిని లాక్కున్నారని విమర్శించారు. భారత్ మాల రహదారి నిర్మాణంలో భూములతో పాటు బావులు బోర్లు పైపులైన్లు , చెట్లు కోల్పోయిన రైతులకు కూడా నష్టపరిహారం పెంచి ఇవ్వాలని చట్టం చెబుతున్నదని కానీ ఇవేమీ పాటించకుండా రైతుల జీవనాధారమైన భూమిని లాక్కొని రైతులను నిరాశ్రయులను చేయడం పట్ల అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని విమర్శించారు.

భారత్ మాల రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఆర్బిట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేసి రెండవ విడత భూసేకరణ సందర్భంగా ఇచ్చిన అవార్డు ప్రకారం మొదటి విడత భూములు కోల్పోయిన రైతులకు కూడా నష్టపరిహారం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయిన రైతులకు భూమికి సమానంగా భూమి కుటుంబానికి ఉద్యోగం, భూమి అందించే వరకు ఆ కుటుంబానికి పోషణ తదితర అనేక రక్షణలు చట్టంలో పేర్కొన్న ఎందుకు చట్టాన్ని అనుసరించి రైతులకు న్యాయం చేయలేదని అన్నారు.

జిల్లాలో ఆరు మండలాల పరిధిలోని 19 గ్రామాలలో రైతుల నుండి రెండు విడుదలగా దాదాపు 800 ఎకరాల భూమి సేకరించినా వారికి తగిన నష్టపరిహారం ఇవ్వకుండా ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిప్పడం సరికాదు అన్నారు. రైతుల పొలాలకు వెళ్లడానికి భారత్ మాల రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లు వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, బ్రిడ్జిల నిర్మాణం కూడా చాలా తక్కువ ఎత్తులో నిర్మించారని దీనివల్ల రైతుల వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని అందువల్ల ఎత్తు పెంచి బ్రిడ్జిల నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనం తరం రైతులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

కలెక్టర్ స్పందిస్తూ నష్టపరిహారం అమౌంట్ పెంచి ఇవ్వడం కోసం ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించామని ఒక నెల రోజుల లోపల రైతులందరికీ నష్టపరిహారం వస్తుందని తెలిపారు. సర్వీస్ రోడ్ల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను క్షేత్రస్థాయిలో వచ్చి పరిశీలన చేసి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు.

రైతులు కోల్పో యిన బావులు, బోర్లు, పైపులైన్లు మరియు చెట్లకు అధికారుల నుండి రిపోర్టులు తెప్పించుకొని పరిశీలిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొంతల చంద్రారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి డి.బాల్ రెడ్డి, కర్ణాటక ప్రాంత రైతు సంఘం రాయచూరు జిల్లా అధ్యక్షులు వీరన్న గౌడ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జీకే ఈదన్న, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పేరు నరసింహ, గట్టన్న, రైతులు అంపేష్, శేఖర్, లోకేశ్వర్ రెడ్డి, అనంతరెడ్డి, కృష్ణారెడ్డి, చాకలి శ్రీనివాసులు, మంగళ సుధాకర్, తిరుపతి రెడ్డి, మల్లేష్ తో పాటు వివిధ మండలాల రైతులు పాల్గొన్నారు.


# నిర్మాణంలో ఉన్న భవనం వద్ద ఒరిగిన క్రేన్

**బండ్లగూడ ఓం నగర్‌లో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తు భవనం**

**తప్పిన పెను ప్రమాదం**

**రాజేంద్రనగర్, జూలై30(నమస్తే ఉదయం):** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని ఓం నగర్ కాలనీ లో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తు భవనానికి నిర్మాణ సామాగ్రినిపైకి తీసుకు వెళ్తున్న క్రేన్ పక్కనే ఉన్న ఇంటి పైకి ఒరిగి పోయింది. ఈ సంఘటన మంగళవారం రాత్రి జరిగింది.

తన ఇంటి మిద్దెపై చంటి బిడ్డతో వాకింగ్ చేస్తున్న నిలోఫర్ అనే వివాహితకు ప్రమాదం తప్పింది. క్రేన్ తమ ఇంటి మెట్ల వైపు పడటంతో ఒక్కసారిగా భయభ్రాంతులకు గురై కిందకు పరుగులు తీసిన నిలోఫర్. భారీ శబ్దానికి ఇళ్ల నుండి బయటకు పరుగులు తీసిన కాలనీ వాసులు.



బండ్లగూడ జాగీర్ మునిసిపల్ కార్పోరేషన్ ఓం నగర్ కాలనీలో కొనసాగుతున్న బహుళ అంతస్తుల భవనం.

24 గంటలు నిర్విరామంగా కొనసాగుతున్న బహుళ అంతస్తుల భవన నిర్మాణ పనులు. భవన నిర్మాణ దారుడి కన్స్ట్రక్షన్ ఇంచార్జ్ పై దాడికి యత్నించిన కాలనీ వాసులు. విషయాన్ని తెలుసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిర్మాణ సంస్థ సూపర్ వైసర్ వెంకటేశ్వర్లును ప్రశ్నిస్తున్నట్లు సమాచారం.





బోనాల ఉత్సవాలలో పాల్గొన్న రాజేంద్రనగర్ అసెంబ్లీ బిజెపి కంటెస్టెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డి, పోతురాజులతో కార్పోరేటర్ తో కల శ్రీనివాస్ రెడ్డి

# అమ్మ ఆశీస్సులతో ప్రజల సుభిక్షంగా ఉండాలి

**- తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్, జూలై 30(నమస్తే ఉదయం):** అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని రాజేంద్రనగర్ అసెంబ్లీ బిజెపి కంటెస్టెడ్ అభ్యర్థి, కార్పొరేటర్ తో కల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో జరిగిన "బోనాల ఉత్సవాలలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొని అమ్మవారి "ఘట్టాల ఊరేగింపు" "ఫలహారం బండి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అమ్మవారి ఆశ ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

అమ్మవారి చల్లని ఆశీస్సులు, దీవెనలతో ప్రజలందరూ రాష్ట్రంలో సుభిక్షంగా వర్షాలు కురిసి ప్రజలందరూ పాడిపంటలతో సుభిక్షంగా ఆనందంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు కార్పొరేటర్ తొకల శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733